అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

గురువారం 4, జూన్ 2026 | సంపుటి :03 | సంచిక :115 | పేజీలు :05 | వెల ₹5




# సైబర్ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా వెంకటరమణ

అక్షరదర్బార్, హనుమకొండ: సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ నూతన డీఎస్పీగా నియమితులైన ఎం వెంకటరమణ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల్లో సైబర్ నేరాలపై మరింత అవగహన కల్పించాలని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ సైబర్ క్రైమ్ డీఎస్పీగా పనిచేసిన కె గిరికుమార్ మహబూబ్ నగర్ సైబర్ క్రైమ్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.

# ఊరట

- ద్రోణి ప్రభావంతో రాగల మూడు రోజులు ముందస్తు వర్షాలు..
- జూన్ రెండో వారంలో రుతుపవనాల ఎంట్రీ!
- పడిపోనున్న ఉష్ణోగ్రతలు.. అప్రమత్తంగా ఉండాలన్న వాతావరణ శాఖ

03





# ఆదర్శం

## ప్రైవేట్ బళ్లకు చిన్నబోయినపల్లి 'చెక్'

- ఒకేరోజు సర్కారు స్కూళ్లో 103 అడ్మిషన్లు
- 'మహా జాతర'గా మారిన గ్రామసభ
- ప్రైవేట్ స్కూల్ వాహనాలకు నో-ఎంట్రీ
- ఏకగ్రీవ తీర్మానం చేసిన గ్రామస్తులు

05



ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామం రాష్ట్ర విద్యావ్యవస్థకే ఒక గొప్ప దిక్సూచిలా నిలిచింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా, "సామాజిక సమానత్వం విద్య ద్వారానే సాధ్యం" అనే సామాజిక స్ఫూర్తితో ఆ ఊరి ప్రజలు వేసిన అడుగు చారిత్రాత్మకంగా నిలిచింది. గ్రామంలోని పిల్లలందరినీ స్థానిక ప్రభుత్వ యూపీఎస్ పాఠశాలలోనే చేర్పించాలని గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవంగా తీర్మానించారు. అంతేకాదు, ప్రైవేట్ పాఠశాలల వాహనాలను గ్రామంలోకి అనుమతించకూడదని సంచలన నిర్ణయం తీసుకున్నారు. గ్రామసభ నిర్ణయాన్ని ఉల్లంఘించి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపితే సంబంధిత కుటుంబాలపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

- అక్షరదర్బార్, ఏటూరునాగారం

# నమ్మకాన్ని నిలబెట్టడమే వైద్యుల కర్తవ్యం



- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంజీఎం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి నిర్ణయం
- బయోమెట్రిక్ తప్పనిసరి..
- ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక విభాగం.. ఎంపీ
- ఆసుపత్రి ప్రక్షాళన, నాణ్యమైన వైద్యమే లక్ష్యం.. : కలెక్టర్

02

# నమ్మకాన్ని నిలబెట్టడమే వైద్యుల కర్తవ్యం

- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంజీఎం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి నిర్ణయం
- బయోమెట్రిక్ తప్పనిసరి..
- ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక విభాగం..ఎంపీ
- ఆసుపత్రి ప్రక్షాళన, నాణ్యమైన వైద్యమే లక్ష్యం.. కలెక్టర్



అక్షరదర్బార్, వరంగల్: ఉత్తర తెలంగాణ ప్రజల ఆరోగ్య ప్రదాయిని అయిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను, వైద్యులను ఆదేశించారు. బుధవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, ఎంజీఎం అభివృద్ధి కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన 'ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ' సమీక్షా సమావేశం కీలక నిర్ణయాలతో జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య, నర్సింగ్ సిబ్బంది భర్తీ, అత్యవసర విభాగంలో రద్దీ నియంత్రణ, ఆధునిక వైద్య పరికరాల కొరత తీర్చడం, పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. శిథిలావస్థకు చేరిన నర్సింగ్ స్కూల్ భవన సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ సత్య శారద ఆసుపత్రులు, పాఠశాలల్లో 'కంప్లైంట్ బాక్సులు' ఏర్పాటు చేసి సమస్యల ప్రక్షాళనకు తీసుకుంటున్న ప్రత్యేక చొరవ వల్ల ఎంజీఎంలో గతంలో కంటే మెరుగైన సేవలు అందుతున్నాయని మంత్రి అభినందించారు.

### నిధుల సమీకరణకు కృషి.. బయోమెట్రిక్ తప్పనిసరి


వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఎంజీఎం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పీఎంఎస్ఎస్‌వై పథకం కింద మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది విధులకు తప్పనిసరిగా హాజరయ్యేలాబయోమెట్రిక్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. మ్యూరో సర్జరీలపై నిలదీత. ఆసుపత్రిలో న్యూరో సర్జరీల సంఖ్య ఎందుకు తగ్గిందని అధికారులను ప్రశ్నించిన ఎంపీ, ఈ విభాగాన్ని వెంటనే బలోపేతం చేయాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక విభాగం,..నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల (తృతీయ ప్రకృతి వికలాంగుల) కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, వారి ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మానవీయ కోణంలో సరికొత్త ప్రతిపాదన చేశారు.

### కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, కొత్తగా నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు వీలుగా నైపుణ్యం కలిగిన వైద్యులను అందుబాటులోకి తేవాలన్నారు. ఆసుపత్రి ప్రధాన గేటు నుండి భవన ప్రాంగణం చాలా దూరంగా ఉన్నందున, రోగుల సౌకర్యార్థం సీఎస్ఆర్ (నిధుల ద్వారా బ్యాటరీ సైకిల్ రిక్షాలు' లేదా ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు

### నిరంతర సమీక్షలతో ముందడుగు

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ఆసుపత్రుల ప్రక్షాళన, తెచ్చి నాణ్యమైన వైద్యం అందించుటలో జిల్లా యంత్రాంగాన్ని ఒక 'అడ్మిన్ కమిటీ'గా ఏర్పాటు చేసి పేద ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. తరచూ ఇన్ఫ్రాస్ట్రక్చర్, మ్యాన్‌పవర్, పరిపాలన సౌలభ్యంపై సమీక్షలు నిర్వహిస్తూ ఎంజీఎం ఆస్పత్రి ప్రజలకు నిరంతర సేవలు అందించుటలో ముందుండేలా చూస్తామని పేర్కొన్నారు. హాజరైన ప్రముఖులు ఈ ఉన్నత స్థాయి సమీక్షా నేను సమావేశంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్ర రెడ్డి, డాక్టర్ అశ్విన్ కుమార్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డీబీసిడీఓ పుష్పలత, డీటీడీఓ నారాయణరెడ్డి, డీఆర్డీఓ నాగ పద్మజ, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బి శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ టి రఘునాథ్ స్వామి, డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ సిహెచ్. మురళి, డాక్టర్ అనిల్, కేఎస్ కే. ప్రసాద్, డాక్టర్ లోకేష్ కుమార్, డాక్టర్ మన్మోహన్ రాజ్, ఐఆర్సీఎస్ సభ్యులు ఇవి శ్రీనివాస్, వనపర్తి శ్రీనివాస్, కన్నుజు లావణ్య రమేష్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ సంధ్య, డాక్టర్ శరత్ బాబు, ఇతర వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రూ.కోటి ప్రమాద బీమా చెక్కును అందజేసిన భట్టి

- విధి నిర్వహణలో మృతి చెందిన ఎన్పీడీసీఎల్ లైన్‌మెన్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి లభించిన ఆర్థిక భరోసా
- ప్రజాభవన్‌లో మృతుడి భార్య స్వప్నకు చెక్కు అందజేత

అక్షరదర్బార్, హనుమకొండ: ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన లైన్‌మెన్ సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్ సతీమణి (నామినీ) సోన్కాంబ్లే స్వప్నకు రూ.1 కోటి విలువైన ప్రమాద బీమా చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ప్రజాభవన్‌లో అందజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎన్పీడీసీఎల్‌కు గతంలో కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) ప్రకారం.. యూఎస్ఎస్‌ఏ-2/ యూఎస్ఎస్‌ఏ-3 పథకాల కింద శాలరీ ఖాతాలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రూ.1 కోటి విలువైన వ్యక్తిగత ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్నారు. ఈ పథకంలో భాగంగానే ఎన్పీడీసీఎల్ నిర్మల్ సర్కిల్ పరిధిలోని బాసరలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్, 2024 సెప్టెంబర్ 23న బాసర శాఖలో తన 'యూఎస్ఎస్‌ఏ-2' శాలరీ ప్యాకేజీ ఖాతాను ప్రారంభించారు. అయితే, దురదృష్టవశాత్తు ఆయన 2025 మార్చి 24న విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో మరణించారు. ఆయన అకాల మరణం తర్వాత, మృతుని నామినీ అయిన సోన్కాంబ్లే స్వప్న క్లెయిమ్ దరఖాస్తును బాసర శాఖలో సమర్పించారు. ఈ క్రమంలో రూ.1 కోటి బీమా మొత్తం గత మే 30 న స్వప్న సేవింగ్స్ ఖాతాలో జమ అయింది. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వానికి, బ్యాంకింగ్ రంగానికి ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. అలాగే యూఎస్ఎస్‌ఏ శాలరీ ప్యాకేజ్ పథకాల కింద అందిస్తున్న బీమా ప్రయోజనాల ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తోంది. ప్రజాభవన్‌లో జరిగిన ఈ అధికారిక చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, యూనియన్ బ్యాంక్ సీఈవో అశిష్ పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమరేష్ ప్రసాద్, చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు, నిజామాబాద్ రీజినల్ హెడ్ అరుణ సవిత, చీఫ్ మేనేజర్ వైవీ రాఘవ, బ్రాంచ్ మేనేజర్ విజయ్ కుమార్, తదితర ఉన్నతాధికారులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.




# సెటిల్ మెంట్లు చేసే రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇవ్వండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- కేయూసీ పోలీస్ స్టేషన్ సందర్శన

అక్షరదర్బార్, హనుమకొండ: భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వ వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ స్టేషన్ అధికారులను అదేశించారు. ఆయన బుధవారం కేయూసీ పోలీస్ స్టేషన్ సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ఏసీపీ నర్సింహరావు, ఇన్ స్పెక్టర్ రవికుమార్ పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీ గదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం సీపీ స్టేషన్ కు సంబంధించిన రికార్డులు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్లు ఎలా ఉన్నారు. ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను స్టేషన్ ఇన్ స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక "కౌన్సిలింగ్" ఇవ్వాలని, రౌడీ షీటర్ల పట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా ఉన్న రౌడీపై నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ముఖ్యంగా స్థానికంగా ఉన్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమర్, రాజమౌళి పాల్గొన్నారు.



## వేణు-వేదశ్రీ దంపతుల కుమార్తె అద్వితకు ఆశీస్సులు

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన 'ఈనాడు' పాత్రికేయుడు తోకల వేణు, వేదశ్రీ దంపతుల కుమార్తె చిరంజీవి అద్విత నూతన ఫల వస్త్రాలంకరణ మహోత్సవం బుధవారం ఎల్లారెడ్డిపల్లె కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి బీజేపీ నాయకురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, తహసిల్దార్ సునీత, ఎంపీడీవో సురేందర్ గౌడ్, ఎంఈఓ లింగాల కుమారస్వామి, సర్పంచులు చాట్ల విజయ రవీందర్, నైనకంటి మమతా ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు నరహరి భక్కి రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, బిఆర్ఎస్ నేతలు తక్కల్లపల్లి రాజు, రాము, రమేష్ హాజరయ్యారు. అలాగే ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల సారయ్య, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, కోశాధికారి సాగర్, పలువురు జర్నలిస్టులు చిన్నారిని ఆశీర్వదించారు.

# ఫోన్ కాల్.. ఆపై మృత్యువు!

- హత్యేనని కుటుంబ సభ్యుల ఆరోపణలు
- పోలీసుల అదుపులో అనుమానితులు

## ల్యాబ్ టెక్నీషియన్ షరీపుద్దీన్ అనుమానాస్పద మృతి

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షరీపుద్దీన్ (35) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం పరకాల పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. మంగళవారం రాత్రి వచ్చిన ఓ ఫోన్ కాల్ అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన, కొద్దిసేపటికే వెల్లంపల్లి రోడ్డులో శవమై కనిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. షరీఫోద్దీన్ హనుమకొండలో ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తూ పరకాలలో నివాసం ఉంటున్నారు. ఆయన భార్య పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. తమకు ఎలాంటి శత్రుత్వాలు లేవని, ఫోన్ కాల్ వచ్చిన కొద్ది గంటల్లోనే మరణించడంపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. షరీపుద్దీన్‌ను ముందుగా ఒక



రేకుల షెడ్డులో హత్య చేసి, ఆ తర్వాత మృతదేహాన్ని రోడ్డుపై పడేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆయనకు ఫోన్ చేసి పిలిచింది ఎవరు? చివరిసారిగా ఎవరిని కలిశారు? అనే కోణంలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు ఎం.డి. రజాక్ పరకాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాల్ డేటా, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# రూ.15 లక్షల సుపారీ గ్యాంగ్ అరెస్ట్

- భూవివాదమే కారణం.. సొంత అన్న, మేనల్లుడే సూత్రధారులు
- పాలకుర్తి హత్యాయత్నం కేసును ఛేదించిన పోలీసులు

అక్షరదర్బార్, పాలకుర్తి: జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గత వారం జరిగిన తీగల ధర్మారావు హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన సుపారీ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సొంత అన్నదమ్ముల మధ్య ఉన్న భూవివాదమే ఈ హత్యాయత్నానికి కారణమని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు.

**రూ.15 లక్షల సుపారీ డీల్..**

బాధితుడు తీగల ధర్మారావును హతమార్చడానికి అతని సొంత అన్న తీగల కిషన్ రావు, అతని కుమారుడు తీగల కుమార్ కలిసి పక్కా స్కెచ్ వేశారు. ఇందుకోసం ఒక సుపారీ ముఠాతో రూ.15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య బుధవారం మీడియాకు వెల్లడించారు. అడ్వాన్స్ తీసుకున్న సదరు గ్యాంగ్.. గత వారం పాలకుర్తి బస్టాండ్ సమీపంలో ధర్మారావుపై ప్రాణాంతక దాడికి పాల్పడింది.

**పోలీసుల వేట.. మరికొందరు పరారీ**

ఈ దాడిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగి నిందితులను గాలించారు. సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి విచారణ ఆధారంగా సుపారీ గ్యాంగ్ సభ్యులను బుధవారం అరెస్ట్ చేశారు. అయితే, ఈ కేసులో మరికొందరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నామని ఏసీపీ తెలిపారు. నిందితులపై కఠిన చట్టాల కింద చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.




# ఊరట

- ద్రోణి ప్రభావంతో రాగల మూడు రోజులు ముందస్తు వర్షాలు..
- జూన్ రెండో వారంలో రుతుపవనాల ఎంట్రీ!
- పడిపోనున్న ఉష్ణోగ్రతలు.. అప్రమత్తంగా ఉండాలన్న వాతావరణ శాఖ

## చురుగ్గా కదులుతున్న రుతుపవనాలు.. కేరళ తీరానికి చేరువలో 'నైరుతి'..



అక్షరదర్బార్, హైదరాబాద్: ఎండతీవ్రతతో, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు అరేబియా సముద్రంలో చురుగ్గా కదులుతూ ముందుకు సాగుతున్నాయి. ఈనెల 4 గురువారం నాటికి ఇవి కేరళ తీరాన్ని తాకేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) వెల్లడించింది. మరోవైపు, ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో ముందస్తు వర్షాలు ఊపందుకున్నాయి.

### రాగల 3 రోజులు విస్తారంగా వర్షాలు


మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రాబోయే మూడు రోజుల పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల (కొన్ని చోట్ల 60 కి.మీ) వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. వర్షాల ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2°C నుండి 4°C వరకు తగ్గే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు ఎండల నుండి పెద్ద ఉపశమనం లభించనుంది.

### తెలంగాణలోకి జూన్ 8 - 10 మధ్య ఎంట్రీ!

కేరళను తాకిన తర్వాత రుతుపవనాలు క్రమంగా రాయలసీమ మీదుగా తెలంగాణ వైపు ప్రయాణిస్తాయి. జూన్ రెండో వారంలో (జూన్ 8 నుండి 10వ తేదీల మధ్య) నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. తొలుత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (నారాయణపేట, నాగర్‌కర్నూల్) పరిసర ప్రాంతాల ద్వారా ఇవి రాష్ట్రంలోకి ప్రవేశించి, ఆ తదుపరి రెండు రోజుల్లో హైదరాబాద్ సహా మిగిలిన జిల్లాలకు విస్తరించనున్నాయి. గత ఏడాది (2025) మే చివరి వారంలోనే రుతుపవనాలు రాగా, ఈసారి ఎల్ నినో ఎఫెక్ట్ మరియు గాలి వాటంలో మార్పుల వల్ల సాధారణ సమయానికే (జూన్ రెండో వారంలో) వస్తున్నట్లు సైంటిస్టులు పేర్కొన్నారు.

**అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక**

రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షా లు పడే సమయంలో పాత భవనాలు, తాత్కాలిక షెడ్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగుల కింద నిలబడవద్దని ప్రజలకు సూచించారు. ఖరీఫ్ సీజన్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు ఈ ముందస్తు వర్షా ల ఆధారంగా భూములను దున్నుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.







## కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ

అక్షరదర్బార్, దుగ్గొండి: మండలంలోని మర్రిపల్లి గ్రామంలో ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు గ్రామ సర్పంచ్ ద్యాగం సుజాత సుధాకర్ మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకే ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కుంట రాజుకుమార్, వార్డు సభ్యులు ద్యాగం రాణి, కుక్కమూడి కవిత, గాజు శివాజీ, ఆశా కార్యకర్త మైదం సరోజన, గ్రామస్తులు గొర్రె రవి, రంపీస మల్లయ్య, కుక్కమూడి చిరంజీవి, కొత్తపెల్లి శోభన్, ద్యాగం శివాజీ పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన సర్పంచ్

అక్షరదర్బార్, చిట్యాల: నైన్‌పాక గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్ యాదవ్ బుధవారం పరిశీలించారు. ఎండలు మండుతున్నందున కూలీలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను కోరారు. కూలీలంతా కాటన్ దుస్తులు ధరించి, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫోటో క్యాప్చర్ కోసం సీనియర్ మేట్లను పెట్టి పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేట్లు, వాటర్ మ్యాన్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# కేంద్రం కార్పొరేట్లకు లొంగిపోయింది

○ గుమ్మడి నర్సయ్య




అక్షరదర్బార్, నెల్లికుదురు: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ పెట్టుబడిదారులకు లొంగిపోయిందని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య విమర్శించారు. మేచరాజుపల్లిలో సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం కుల మతాల పేరిట చీలికలు తెస్తూ లౌకిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తోందని, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో కాలయాపన చేస్తోందని, రైతులకు రుణమాఫీ సక్రమంగా కాలేదని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రవి, జక్కుల యాకన్న, దొడ్ల కేశవులు, టి. రవీందర్, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

### ఓటరు జాబితా సవరణకు
# సమన్వయంతో కృషి చేయాలి

○ ఆర్డీఓ డీఎస్ వెంకన్న



అక్షరదర్బార్, పరకాల: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)–2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ డివిజన్ అధికారి డీఎస్ వెంకన్న సూచించారు. బుధవారం పరకాల పట్టణంలోని మహదేవ్ ఫంక్షన్ హాల్లో 104–పరకాల నియోజకవర్గ పరిధిలోని అధికారులు, తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఏలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పరకాల, దామెర, ఆత్మకూరు, నడికూడ, గీసుకొండ, సంగెం తహసీల్దార్లు టి. విజయలక్ష్మి, జ్యోతి వరలక్ష్మి, జగన్మోహన్ రెడ్డి, రాణి, రియాజుద్దీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై బీఎల్ఏలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని అధికారులు కోరారు.

# టీటీసీ విద్యార్థినుల 'ఫుడ్ ఫెస్టివల్' అద్భుతం



అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టిటీసీ) కోర్స్–2026లో భాగంగా నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. రూమ్ నంబర్–2 విద్యార్థినులు స్వయంగా పోషక విలువలతో కూడిన వంటకాలను తయారు చేసి అతిథులకు వడ్డించారు. ఈ కార్యక్రమానికి ఏసీజీ మధుసూదన్‌రావు, కోర్స్ ఇన్‌చార్జ్ విజయ్‌మోహన్, కోర్స్ డైరెక్టర్ నయీమ్ పాషా అతిథులుగా హాజరై విద్యార్థినుల సృజనాత్మకత, జట్టుతత్వాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యం, ట్రైనింగ్ ఉపాధ్యాయురాలు సుమలత, విద్యార్థినులు కవిత, ప్రవళిక, సృజన, అనిత, జ్యోతిలక్ష్మి, కళ్యాణి, సౌజన్య, శోభ, జిలేఖ, మానస, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ కుసుంబ లింగయ్యకు నివాళులు

అక్షరదర్బార్, దుగ్గొండి: మలిదశ భూపోరాట తొలి అమరవీరుడు కామ్రేడ్ కుసుంబ లింగయ్య 55వ వర్ధంతి వేడుకలను రేబల్లె గ్రామంలోని ఆయన స్మారక స్థూపం వద్ద బుధవారం నిర్వహించారు. ఎంసీపీఐ (యు) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ హాజరై నివాళులర్పించారు. 1971లో పేదలకు భూమి దక్కాలనే ఆశయంతో సాగిన పోరాటంలో లింగయ్య ప్రాణత్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కుసుంబ బాబురావు, మహమ్మద్ హుస్సేన్, కొమురయ్య, పకిడె చందర్ రావు, పేరబోయిన ఐలోని, చేరాలు, లాల్ మహమ్మద్ పాల్గొన్నారు.



## జూకల్‌లో వడదెబ్బతో కౌలు రైతు మృతి



అక్షరదర్బార్, చిట్యాల: చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన మాశబోయిన రాజయ్య (65) అనే వృద్ధుడు వడదెబ్బ తగిలి బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య ఉదయం చల్లగరిగ గ్రామ శివారులో తను కౌలుకు తీసుకున్న పొలంలో మొక్కజొన్న చొప్ప కాలబెట్టడానికి వెళ్లాడు. పని చేస్తున్న క్రమంలో ఎండ తీవ్రతకు స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు.

# ఆదర్శం

## ప్రైవేట్ బళ్లకు చిన్నబోయినపల్లి 'చెక్'

- ఒకేరోజు సర్కారు స్కూల్లో 103 అడ్మిషన్లు
- 'మహా' జాతరగా మారిన గ్రామసభ
- ప్రైవేట్ స్కూల్ వాహనాలకు నో-ఎంట్రీ
- ఏకగ్రీవ తీర్మానం చేసిన గ్రామస్తులు

అక్షరదర్బార్, ఏటూరునాగారం : ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామం రాష్ట్ర విద్యావ్యవస్థకే ఒక గొప్ప దిక్సూచిలా నిలిచింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా, "సామాజిక సమానత్వం విద్య ద్వారానే సాధ్యం" అనే సామాజిక స్ఫూర్తితో ఆ ఊరి ప్రజలు వేసిన అడుగు చారిత్రాత్మకంగా నిలిచింది.

గ్రామంలోని పిల్లలందరినీ స్థానిక ప్రభుత్వ యూపీఎస్ పాఠశాలలోనే చేర్పించాలని గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవంగా తీర్మానించారు. అంతేకాదు, ప్రైవేట్ పాఠశాలల వాహనాలను గ్రామంలోకి అనుమతించకూడదని సంచలన నిర్ణయం తీసుకున్నారు. గ్రామసభ నిర్ణయాన్ని ఉల్లంఘించి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపితే సంబంధిత కుటుంబాలపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.





### తెలంగాణ విద్యా చరిత్రలోనే అరుదైన ఘట్టం

చదువుల తల్లి ముంగిట ఒక్కరోజే ఏకంగా 103 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం తెలంగాణ విద్యా చరిత్రలో మునుపెన్నడూ చూడని ఒక అరుదైన ఘట్టం. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో గతంలో కొంత నిరాశ నెలకొన్నప్పటికీ, చిన్నబోయినపల్లి ప్రజలు తమ అక్షర సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల పట్ల తమకున్న నమ్మకాన్ని ఘనంగా నిరూపించుకున్నారు.

### ఘనంగా 'వెల్కమ్ కిట్స్' పంపిణీ

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత అధ్యక్షతన జరిగిన ఈ మహా అడ్మిషన్ల జాతరకు ముఖ్య అతిథులుగా చిన్నబోయినపల్లి గ్రామ సర్పంచ్ నల్లబోయిన నాగార్జున, ఎంఈవో, సీడీపీవో, ప్రభుత్వ వైద్యులు మరియు వివిధ ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. హెచ్ఎం కవిత పర్యవేక్షణలో, అతిథుల చేతుల మీదుగా కొత్తగా చేరిన 103 మంది విద్యార్థులకు 'వెల్కమ్ కిట్స్' అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధి పట్ల గ్రామస్తులకు ఉన్న నిబద్ధతను అధికారులు ఈ సందర్భంగా 'శభాష్' అంటూ అభినందించారు.

### మంత్రి సీతక్క సహకారంతో పాఠశాల అభివృద్ధి

బడి పిల్లల భద్రత కోసం అత్యంత కీలకమైన ప్రహరీ గోడ నిర్మాణం, పాఠశాల సమగ్ర అభివృద్ధి కోసం 'ఆశయం గ్రంథాలయం' ఏర్పాటు చేయనున్నారు. పాఠశాల అభివృద్ధికి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు, స్వయంగా ఇదే గ్రామానికి చెందిన దుపటి సతీష్ దగ్గరుండి అధికారులతో పదేపదే చర్చిస్తూ సమన్వయం చేస్తున్నారు. ఇందుకు రాష్ట్ర మంత్రి సీతక్క సహకారం కూడా ఉన్నట్లు ఆయన తెలిపారు.

### ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి

ప్రజలు, విద్యార్థులు ఇంతటి ఆసక్తి చూపుతున్న ఈ తరుణంలో, ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు మరింత సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరిపడా ఉపాధ్యాయులను నియమించి, మౌలిక వసతులు కల్పిస్తే.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు ఇదొక ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజలు రగిలించిన ఈ విద్యాభివృద్ధి జ్వాలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




---



# పూర్వ విద్యార్థుల సమావేశం

### సంఘ భవన నిర్మాణంపై సమీక్ష

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (అలుమ్ని అసోసియేషన్) అత్యవసర సమావేశం సంఘ అధ్యక్షుడు ఇవి శ్రీనివాస్ రావు అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ పూర్వ విద్యార్థి, అసిస్టెంట్ ఇంజనీర్ గా సేవలందించిన తక్కళ్లపల్లి కొండల్ రావు గత మే 25న మరణించడంతో, సమావేశంలో సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం అలుమ్ని అసోసియేషన్ భవనం నిర్మాణ పనుల పురోగతి, భూమి పూజ కార్యక్రమం నిర్వహణ, నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు, సభ్యుల సహకారం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. పూర్వ విద్యార్థుల మధ్య మరింత సమన్వయం పెంపొందించడం, సంఘ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం, భవిష్యత్ కార్యాచరణపై కూడా సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి ఆనంద్, సీనియర్ నాయకులు టీఎన్ స్వామి, ఎం ప్రకాష్, బొద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్ రావు, ఉమేందర్, సుధాకర్ రావు, వెంకటస్వామి, ధర్మ శ్రీనివాస్ రెడ్డి, శశి తదితరులు పాల్గొని తమ విలువైన సూచనలు అందించారు.